దిగజారిన నిమ్మ ధరలు


విక్రయానికి సిద్ధం చేసిన నిమ్మకాయలు

సైదాపురం: నిమ్మ ధరలు రోజు రోజుకూ దిగజారుతున్నాయి. ఈ ఏడాది రైతులు ఆశించిన ధరలు లేకపోవడంతో డీలా పడ్డారు. గతేడాదితో పోల్చి చూస్తే ఈ ఏడాది ధరలు చాలా తక్కువగా ఉన్నాయని రైతులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో లూజు బస్తా రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు మాత్రమే ధర పలుకుతోంది. కిలోల లెక్కన కిలోకూ రూ.10 నుంచి రూ.20 ధర ఉంది. అయితే ఏప్రిల్, మే నెలల్లో ఒక మోస్తరు ధరలు పలికినా ఆ తరువాత తగ్గిపోయాయి. ఈ ఏడాది అత్యధిక ధర అంటే రూ.6 వేలు పలికింది. గతేడాది అత్యధికంగా రూ.14 వేల వరకు ధర పలికిందని రైతులు పేర్కొన్నారు. వేసవిలో నిమ్మకాయలకు ఎక్కువగా డిమాండ్ ఉన్నా ధరలు పెరగలేదని రైతులు చెబుతున్నారు. తోటల నుంచి కాయల దిగుబడి పెరిగినట్లు వ్యాపారులు వెల్లడిస్తున్నారు. ధరలు పతనం కావడంపై రైతేలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బీటెక్ విద్యార్థినికి ఆర్థిక సాయం


విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

చిల్లకూరు: బీటెక్ చదువుకునే ఓ విద్యార్థినికి రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.20 వేలు ఆర్థిక సహాయం గురువారం అందజేశారు. మండలంలోని పారిచెర్లవారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కోట మండలం విద్యానగర్‌కు చెందిన కవిత అనే విద్యార్థిని ఇంటర్ ఉత్తీర్ణత సాధించి బీటెక్‌లో అడ్మిషన్ పొందింది. అయితే ఆమెకు ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో ట్రస్టు నిర్వాహకులను ఆశ్రయించింది. దీంతో ట్రస్టు వ్యవస్థాపకుడు శ్రీనివాసులు ఆమెకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు రాజనేని పిచ్చయ్యనాయుడు, సభ్యులు బాబు, ప్రజేంద్రరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు శివరామిరెడ్డి, చంద్రవదన, వీపీ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి ముస్తాబైన ఆరోగ్య కేంద్రం



సైదాపురం: మండల కేంద్రంలో రూ.1.50 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. ఆరోగ్య కేంద్రాన్ని అన్ని హంగులతో నిర్మించారు. రోగులు, వైద్యులకు కావాల్సిన సౌకర్యాలను కల్పిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. త్వరలోనే ఆరోగ్య కేంద్రం ప్రారంభించనున్నట్లు వైద్యులు తెలిపారు.

రూ.7లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం


గిరిజన కాలనీలో నిర్మించిన సీసీరోడ్డు

ఓజిలి: మండలంలోని కొండవల్లిపాడు పంచాయతీ పరిధి చుట్టుగుంట ఎస్టీ కాలనీలో రూ.7 లక్షలతో సీసీరోడ్డును నిర్మించారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో గిరిజనులు కాలనీలో అంతర్గత రహదారులు సరిగాలేకపోవడంతో వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన రూ.7 లక్షలు మంజూరు చేయించడంతో సర్పంచ్ కొండూరు ప్రభాకర్‌రాజు సీసీరోడ్డును నిర్మించారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనం


చెట్లు మొలచి పడి పోయేస్థితిలో ఉన్న అంగన్‌వాడీ భవనం

చిల్లకూరు: మండలంలోని ఉడతావారిపార్లపల్లెలో 30 ఏళ్ల కిందట నిర్మించిన అంగన్‌వాడీ భవనం శిదిలావస్థకు చేరుకోవడంతో పాటుగా భవనం పగుళ్లు వచ్చాయిజ ఆ పగుళ్లలో చెట్లు మొలచి పెద్దవి కావడంతో భవనం ఎప్పుడు కూలుతుందోనని చిన్నారులు తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్త ఆందోళన చెందుతున్నారు. మండలంలోని తొణుకుమాల పంచాయతీ ఉడతావారిపార్లపల్లెలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ భవనం ఒకే ఆవరణలో ఉన్నాయి. అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అందులోకి పిల్లలను పంపమని తల్లిదండ్రులు చెబుతున్నారు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్త పక్కనే ఉన్న ఓ ఇంట్లో కేంద్రం నడుపుతోంది. శిథిలావస్థకు చేరుకున్న భవనం పక్కనే ప్రాథమిక పాఠశాల ఉండడంతో పాఠశాలలో చదువుకునే చిన్నారులు విరామ సమయంలో అక్కడకు వెళ్లి ప్రమాదాలకు గురవుతారేమోనని ఉపాధ్యాయులు బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. సర్పంచ్ త్రివిక్రమ్ భూపతి పలుమార్లు మండల అధికారులు దృష్టికి ఈ విషయం తీసుకెళ్లి, శిథిల భవనాన్ని తొలగించేలా అనుమతులు ఇవ్వాలని కోరినా వారు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి ఇబ్బందిగా ఉన్న భవనాన్ని తొలగించి ప్రమాదాలు నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు రెండు సచివాలయాల్లో సురక్ష

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీలోని తుమ్మూరు, ఆర్ముగంనగర్ సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని అర్బన్ జేసీఎస్ కన్వీనర్ చదలవాడ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక, పలు శాఖల అధికారుల పాల్గొంటారన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర

రేణిగుంట: మండలంలోని కరకంబాడిలో గంగమ్మ జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. గంగమ్మ ప్రతిమను నడివీధిలో ప్రతిష్ఠించి వేపాకు పందిరి నిర్మించి అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి దర్శించుకున్నారు. స్థానికులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ముత్యాలమ్మ ఆలయ ఆధునికీకరణ పనుల పరిశీలన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో కల్యాణ మండప ఆధునికీకరణ పనులను గురువారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రూ.34 లక్షలతో ఆధునికీకరణ పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు వేణుగోపాల్, కాంట్రాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీమద్ రామాయణ సప్తాహం

తిరుపతి కల్చరల్: రూరల్ మండలం పుదిపట్ల గ్రామంలో శనివారం నుంచి 28వ తేదీ వరకు రామకృష్ణ సేవా సమాజం ఆధ్వర్యంలో శ్రీమద్ రామాయణ సప్తాహ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి కె.రామకృష్ణ, శతావధాని ఆముదాల మురళి తెలిపారు. వారు గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రామాయణం భారతీయ సంస్కృతికి ఆత్మగా భాసిల్లుతోందన్నారు. సమస్త కళారూపాల్లో రామాయణ గాథ సజీవంగా విరాజిల్లుతోందని వివరించారు.



ప్రతి రైతుకూ బిల్లు ఇవ్వాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ

సైదాపురం: పురుగు మందుల దుకాణాలకు వచ్చే ప్రతి రైతుకూ వారు తీసుకున్న మందులకు తప్పనిసరిగా బిల్లులను ఇవ్వాలని కావలి ఏడీఏ సీహెచ్ నాగరాజు కోరారు. మండల కేంద్రమైన సైదాపురంలోని పలు పురుగు మందుల షాపులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఆయన స్టాక్‌ను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులు, పురుగు మందులను రైతులకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏఓ హైమావతి ఉన్నారు.



కండలేరులో 18.592 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 18.592 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,450 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 50, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 50, లోలెవల్ స్లూయిస్‌కు120 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోట: రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని గురువారం విజిలెన్స్ అధికారులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. విజిలెన్స్ సీఐ వెంకటరవి కథనం మేరకు.. నాయుడుపేట నుంచి కోట క్రాస్‌రోడ్డులోని హరిహర రైస్‌మిల్లుకు ప్రైవేట్ వాహనంలో రేషన్‌బియ్యం తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు వాహనాన్ని వెంబడించి పట్టుకున్నారు. వాహనంలో ఉన్న 78 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనంతో పాటు పట్టుబడిన శివ అనే వ్యక్తిని పోలీసులకు అప్పగించారు. సివిల్‌సప్లై డీటీ సాయిచంద్, విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

బోరుబావి ఏర్పాటు

సైదాపురం: మండలంలోని మొలకలపూండ్ల గ్రామం జగనన్న లేఅవుట్ వద్ద గురువారం నూతన బోరుబావి తవ్వకాన్ని సచివాలయం కన్వీనర్ వెంకటేశ్వర్లు పూజ చేసి, ప్రారంభించారు. త్వరలో ఇక్కడ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నట్లు ఆయన చెప్పారు.





క్లుప్తంగా

బాబాకు ప్రత్యేక పూజలు


అన్నదానం చేస్తున్న దాతలు

ఓజిలి: మానమాల గ్రామంలోని సాయిబాబా మందిరంలో గురువారం భక్తులు బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం కాగడా హారతి, అభిషేకాలు, హారతులు తదితర సేవలు జరిపారు. ఈ పూజలకు నాయుడుపేట మండలం మేనకూరు గ్రామానికి చెందిన కట్టా వెంకటరమణారెడ్డి, సురేఖమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం 300 మందికి అన్నదానం చేశారు. రాత్రి బాబా మందిరంలో సాయినాథునికి పల్లకిసేవ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించండి


మాట్లాడుతున్న డీపీఓ రాజశేఖరరెడ్డి

వెంకటగిరిరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం వెంకటగిరి రానున్న తరుణంలో పంచాయతీ కార్యదర్శులకు కేటాయించిన టీమ్ వర్క్‌లో ఆటంకం లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని డీపీఓ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులకు టీమ్‌లుగా ఏర్పాటు చేసి, విధులు కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తుది దశలో శ్రీనివాస సేతు

తిరుపతి తుడా: శ్రీనివాస సేతు నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయని స్మార్ట్ సిటీ ఎండీ హరిత తెలిపారు. ఆమె గురువారం శ్రీనివాస సేతుపై విద్యుత్, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఆగస్టు ఐదు లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఆగస్టులో శ్రీనివాస సేతును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఎస్‌ఈ మోహన్, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ప్రతిభ


కప్పు అందుకుంటున్న విద్యార్థులు

నాయుడుపేట: రాష్ట్రస్థాయిలో చీరాలలో ఈనెల 18, 19 తేదీల్లో నిర్వహించిన శిక్షణలో నాయుడుపేట డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారు. ప్రతిభ చూపిన విద్యార్థులు మౌనిక, పవన్‌కుమార్‌కు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూదన్‌వర్మ, ఎన్‌సీసీ సమన్వయకర్త శివారెడ్డి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

26న నృసింహునికి చందనాలంకరణ

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఉన్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి మూలమూర్తికి ఈ నెల 26వ తేదీన చందనాలంకరణ చేయనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఆ రోజు స్వాతినక్షత్రం స్వామివారి జన్మనక్షత్రం కావడంతో స్వామివారికి ఉదయం 4 గంటలకు సుప్రభాతం, 9 గంటలకు శాంతిహోమం, 10 గంటలకు కళ్యాణం, రాత్రి 7 గంటలకు బంగారు గరుడసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

డాక్టరేట్


మల్లికార్జునను సన్మానిస్తున్న అధ్యాపకులు

గూడూరురూరల్: మండలంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న అల్లం మల్లికార్జునకు గీతం విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎ.మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో మల్లికార్జునను సన్మానించారు. విశాఖపట్నంలోని గీతం వర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య సింగంపల్లి రమేష్, ఆచార్య కడియాల చంద్రబాబు నాయుడు పర్యవేక్షణలో భౌతిక శాస్త్ర విభాగంలో 'అల్యూమినియం లాంథనం టైటానియం ఆక్సైడ్, బిస్మత్ జింక్ ఐరన్ ఆక్సైడ్ స్ట్రక్చరల్ మార్ఫొలాజికల్, నెగటివ్ డై ఎలక్ట్రిక్ నానో కాంపోజిట్స్' అనే అంశంపై పరిశోధన చేసి, పత్రాలు సమర్పించడంతో ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

ఎన్‌జేఆర్ విగ్రహావిష్కరణ నేడు

రాజకీయ ఉద్దండుడు.. అపర చాణుక్యుడు.. ఉమ్మడి సింహపురికి పెద్దాయన.. ఎందరో రాజకీయాల్లో అగ్రనేతలుగా రాణించడానికి ఆద్యుడు.. నేదురుమల్లి జనార్ధనరెడ్డి. ఆయన విగ్రహాన్ని వెంకటగిరి త్రిభువని సెంటర్‌లో శుక్రవారం ఆవిష్కరించనున్నారు.


నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించనున్న త్రిభువనిసెంటర్ ఇదే (ఇన్‌సెట్) ఎన్‌జేఆర్

వెంకటగిరి: దివంగత ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి విగ్రహన్ని వెంకటగిరి పట్టణం త్రిభువని సెంటర్‌లో శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఈ క్రమంలో ఆయన గురించి.. ఉమ్మడి నెల్లూరు జిల్లా రాజకీయాలను నాలుగు దశాబ్దాలపాటు శాసించిన యోధుడు, రాజకీయ అపర చాణుక్యుడు, ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రజలకు, నేతలకు పెద్దాయనగా నేదురుమల్లి జనార్దన్‌రెడ్డికి పేరు ఉంది. ఉపాధ్యాయుడిగా జీవన ప్రస్థానం ప్రారంభించిన ఆయన ఉమ్మ డి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. ఇది ఆయన విలక్షణ శైలికి నిదర్శనంగా చెప్పవచ్చు. 1972 నుంచి 1978 వరకు రాజ్యసభ సభ్యుడిగా, 1978 నుంచి 1984 వరకు ఎమ్మెల్సీగా కొనసాగారు. ఆ సమయంలోనే రాష్ట్ర రెవెన్యూ, పరిశ్రమలు, వ్యవసాయం, విద్యుత్ శాఖల మంత్రిగా పనిచేశారు. 1988–89లో పీసీసీ అధ్యక్షుడిగా, 1989 ఎన్నికల్లో వెంకటగిరి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై 1990లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవి పొందారు. 1988లో బాపట్ల, 1999లో నరసరావుపేట, 2004లో విశాఖపట్నం నుంచి ఎంపీగా వరుస విజయాలు సాధించారు. 2010లో మరోసారి రాజ్యసభ సభ్యుడిగా ఎంపికయ్యారు.

ఎందరో రాజకీయ ఆరంగేట్రానికి కారకుడు

కలలో కూడా తాము రాజకీయాల్లో ఇంతస్థాయికి ఎదుగుతామని ఊహించని ఎందరినో ఆయన రాజకీయ ప్రవేశం చేయించి, వారు ఉన్నత స్థానానికి ఎదిగేందుకు నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి దోహదపడ్డారు. తన మాటకు విలువివ్వని, తనను ధిక్కరించిన వారికి తనేంటో చూపిండడంలో కూడా ఆయనది ప్రత్యేక శైలి. సుదీర్ఘకాలం తిరుపతి ఎంపీగా, కేంద్రమంత్రిగా పని చేసిన చింతా మోహన్ సిట్టింగ్ ఎంపీ అయినప్పటికీ 1996లో పార్టీ టికెట్ రాకుండా చేసి, ఒక బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న నెలవల సుబ్రమణ్యంకు టికెట్ ఇప్పించి ఎంపీ చేసిన ఘనత కూడా నేదురుమల్లిదే. గృహిణిగా ఉన్న కడుముల పద్మశ్రీని ఎంపీ చేసినా, గూడూరుకు చెందిన గౌస్ మెహీద్దీన్ (ఎంపీ రాజ్యసభ), నెల్లూరు అమెరికన్ ఆస్పత్రిలో హెడ్‌నర్సుగా ఉన్న ఎతిల్‌తేరేను ఎమ్మెల్సీగా, డీపీఆర్‌ఓగా పనిచేస్తున్న పసల పెంచలయ్యను ఎమ్మెల్యేగా, మంత్రి, ఎంపీగా చేసిందీ నేదురుమల్లే. ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థలో చదువుకుని అక్కడే హస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న పత్రా ప్రకాశరావును ఉద్యోగానికి రాజనామా చేయించి మూడుసార్లు గూడూరు ఎమ్మెల్యేగా గెలిచిపించిన ఘనత నేదురుమల్లిదే. అలాగే మేకపాటి రాజమోహన్‌రెడ్డి, సీవీ శేషారెడ్డి, మాగుంట సుబ్బరామిరెడ్డి, పనబాక లక్ష్మి, వాకాటి నారాయణరెడ్డి, చెంచలబాబు యాదవ్, కొడవలూరు ధనంజయరెడ్డి, జేకే రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, సరస్వతి, కొండాపురం రామమ్మ వంటి ఎందరో రాజకీయ ఆరంగేట్రం చేయడానికి కారణం కూడా నేదురుమల్లి జనార్దన్‌రెడ్డే. అలాంటి రాజకీయ ఉద్దండుడి విగ్రహాన్ని శుక్రవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు.

కష్టకాలంలో కుటుంబసభ్యుల్లా..

చిల్లకూరు: కరోనా కష్టకాలంలో వలంటీర్లు అందరికీ కుటుంబ సభ్యుల్లా అండగా నిలిచారు. మహమ్మారి విజృంభిస్తున్న తరుణంలో బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాల్లో ఉన్న వారికి కూరగాయలు, నిత్యావసర సరుకులు, ప్రభుత్వ పథకాలు ఇళ్ల వద్దకే వెళ్లి అందజేశారు. మండలంలోని తొణుకుమాలలో పలువురు కరోనా సోకింది. ఆ సమయంలో గ్రామానికి చెందిన ఎస్‌కే బాబు సాహెబ్ అనే వ్యక్తి కరోనా కారణంగా మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని ఖననం చేయడానికి కుటుంబ సభ్యులు, బంధువులు సైతం వెనకడుగు వేశారు. దీంతో గ్రామానికి చెందిన ఎస్‌కే ముఖ్తార్ అనే వలంటీర్ స్పందించి సచివాలయ సిబ్బందికి సమాచారం అందజేసి, వారి సాయంతో పీపీఈ కిట్లు ధరించి బాబు సాహెబ్ మృతదేహాన్ని ఖననం చేశారు.


మృతదేహాన్ని ఖననం చేస్తున్న వలంటీర్, ఇతరులు

అండగా నిలిచారు



కరోనా సోకి ఎస్‌కే బాబు సాహెబ్ మరణించగా అతడి మృతదేహం ఖననానికి ఎవరూ ముందుకు రాలేదు. మా గ్రామ వలంటర్ స్పందించి, సచివాలయ సిబ్బంది సాయంతో బాబుసాహెబ్ మృతదేహాన్ని ఖననం చేశారు. ఆ సమయంలో గ్రామంలోని పలువురికి వ్యాధి సోకడంతో ఎవరూ బయటకు రాలేదు. ఆ సయయంలో ధైర్యంగా మందులు కూరగాయలు, నిత్యావసర సరుకులు ఇళ్లకే తెచ్చి ఇచ్చారు. మా లాంటి వృద్ధులకు అండగా నిలిచారు. – ఆరూరు సంపూర్ణమ్మ, తొణుకుమాల

ముగిసిన న్యాక్ బృందం తనిఖీలు

వెంకటగిరి: స్థానిక విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న న్యాక్ బృందం తనిఖీలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆ కమిటీ చైర్మన్, ప్రొఫెసర్ ఓంకేశ్వర్ కుమార్ మాట్లాడుతూ కళాశాలలో వసతులు, ఉత్తీర్ణత శాతం, గ్రూపులు, విద్యార్థుల సంఖ్య, అధ్యాపకుల వివరాలు, ప్రయోగశాలలు తనిఖీ చేశామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులతో సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. తాము ఇచ్చే నివేదిక ఆధారంగా కళాశాలకు న్యాక్ గుర్తింపు లభిస్తే ప్రత్యేక నిధులతోపాటు మరిన్ని వసతులు, గ్రూపులు ఏర్పాటు అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాక్ బృందం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సంగీతాజైన్, సభ్యుడు డాక్టర్ మహ్మద్ మీరన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కళ్యాణ్‌చక్రవర్తితో తలశిల భేటీ


ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తితో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం తదితరులు

వెంకటగిరి: ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తిని వెంకటగిరిలోని ఆయన నివాసంలో గురువారం సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం గురుమూర్తి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తలశిల రఘురాం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంకటగిరి పర్యటన విజయవంతం చేసేలా అందరం సమష్టిగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ ఐదు జిల్లాల కన్వీనర్ శివశంకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ ఎం ధనంజయరెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


పూజలు చేస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు

చిల్లకూరు: సొంత గ్రామమైన వల్లిపేడులో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. మండలంలోని వల్లిపేడు గ్రామ ఇలవేల్పు వల్లిపేటీశ్వరస్వామి, అంకమ్మలకు గ్రామ పొంగళ్లను పురస్కరించుకుని గురువారం ఆయన కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, పొంగళ్లు పెట్టి నైవేద్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీకి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయం వద్ద మంగళ వాయిద్యాలతో ఎమ్మెల్సీ కుటుంబ సభ్యులు స్వామి,అమ్మవార్లకు పూజా సామగ్రిని అందజేసి, పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వల్లిపేడు చిన్న గ్రామమని, అలాంటి గ్రామంలో పుట్టిన తనను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సీటు ఇచ్చి, గెలిపించేందుకు కృషి చేశారని, ఉపాధ్యాయులు కూడా తనకు ఎంతో సహకారం అందించారన్నారు. గ్రామస్తులంతా ఒక్కటిగా కలసి పొంగళ్లు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. తాను చదువుకున్న ఉన్నత పాఠశాల అభివృద్ధితో పాటుగా ఈ ప్రాంతంలో ఉన్న వసతి గృహం మళ్లీ పునఃప్రారంభించడం, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం జెడ్పీ, ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఎమ్మెల్సీని కలిసి, శాలువ కప్పి సత్కరించారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పీ చెంగయ్య, నాయకులు ఎం నందకుమార్ పాల్గొన్నారు.

వేలం పాటల్లో రూ.1.70 లక్షల ఆదాయం


వేలం పాటల్లో పాల్గొన్న అధికారులు, సభ్యులు

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన మెట్ట, మాగాణి భూములను కౌలుకు ఇచ్చేందుకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో గురువారం ఆలయ ఆవరణలో వేలం పాటలు నిర్వహించారు. దీని ద్వారా ఆలయానికి రూ.1.70 లక్షలు ఆదాయం వచ్చిందని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కందల ఆనంద్ తెలిపారు. ఆలయానికి చెందిన సర్వే నంబర్ 92–1లో 5 ఎకరాలు మెట్ట భూమి ఐదేళ్ల కౌలుకు వేలం పాట నిర్వహించగా ఏడాదికి రూ.85 వేలు చెల్లించేలా ఓ కంపెనీ వారు పాట పాడుకున్నారు. అలాగే సర్వే నంబర్ 47, 69లోని 5 ఎకరాల 31 సెంట్ల భూమి ఏడాది కౌలుకు పాట నిర్వహించగా గ్రామానికి చెందిన ఓ రైతు రూ.85 వేలకు దక్కించుకున్నట్లు వారు తెలిపారు. ఈ వేలం పాటల్లో ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ట్రస్టు బోర్డు సభ్యులు దొంతు వెంకటేశ్వర్లు, మారుబోయిన రామచంద్రయ్య, అనిశెట్టి సుగుణమ్మ, బూదూరు కోటమ్మ, నాయకులు ఉడతా శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో భక్తులు స్వామివారి హుండీలను గురువారం ఆలయ ఆవరణలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఆనంద్ మాట్లాడుతూ సాధారణంగా ఆరు నెలలకొకసారి కానుకలను లెక్కించే వారమని అయితే ఈ దఫా ఐదు నెలలకు లెక్కించగా రూ 1,39,115 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖాధికారులు, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల నిరసన

గూడూరురూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజారవాణా సంస్థ గూడూరు డిపో వద్ద ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం గేట్ మీటింగ్ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఏఏఎస్, వార్షిక ఇంక్రిమెంట్‌లు సకాలంలో కలపాలని కోరారు. తిరుపతి మార్గంలో రోడ్డు పనులు జరుగుతున్నందున రన్నింగ్ టైమ్ సర్వే చేసి, సరైన టైమింగ్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌కేపీ జిలాజీ, డిపో అధ్యక్షుడు వైవీ నారాయణ, జిల్లా నాయకురాలు పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఎస్వీబీసీ చైర్మన్ సాయికృష్ణయాచేంద్ర

వెంకటగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం వెంకటగిరి పర్యటనలో భాగంగా ఏర్పాటు చేయనున్న సభకు అన్ని వర్గాలు ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని రాజా కుటుంబీకుడు, ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర పిలుపునిచ్చారు. నేదురుమల్లి నివాసంలో వైఎస్సార్‌సీపీ తిరుపతిజిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం బహిరంగసభకు వైఎస్సార్ సీపీ నాయకులు, శ్రేణులు, అభిమానులు, సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇంకా దివంగత సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరగడం శుభపరిణామమన్నారు.

పేదల సమస్యల పరిష్కారానికే సురక్ష

గూడూరురూరల్: పేదల సమస్యలను పరిష్కరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించాలనే ఉద్దేశంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేశారని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి అన్నారు. గూడూరు మండలంలోని నెర్నూరు సచివాలయం వద్ద గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు ధ్రువ పత్రాలను అందజేశారు. గూడూరు జెడ్పీటీసీ సభ్యురాలు యామిని, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు చిన్నయ్య, ఇ శీనయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు యూ మహేంద్రరెడ్డి, బీ రాజేష్, రఘురామరాజు, తదితరులు పాల్గొన్నారు.


గూడూరురూరల్: ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి


గూడూరు రూరల్: లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

వైఎస్సార్ సీపీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ

దేశం గర్వపడేలా జనరంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని, వైఎస్సార్ సీపీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. గూడూరు పట్టణంలోని నలజాలమ్మవీధి, ఇందిరానగర్–3, చెన్నూరు సచివాలయాల్లో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఈసీ సభ్యులు గోపాల్‌రెడ్డి, బీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బీ విజయకుమార్, పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షుడు నరసయ్య, గిరిబాబు, ఏ మురళి, అజీజ్‌ఖాన్, అల్తాఫ్, ముప్పాళ్ల చంద్రమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తక్షణ పరిష్కారం

వాకాడు(చిట్టమూరు): జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కారం అవుతున్నాయని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. చిట్టమూరు మండలంలోని మొలకలపూడిలో జరిగిన కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలకు పరిష్కార వేదిక సురక్ష

నాయుడుపేట: ప్రజల సమస్యలకు పరిష్కార వేదికగా జగనన్న సురక్ష కార్యక్రమం అని ఎంపీపీ ధనలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ కే దీపిక అన్నారు. మండలంలోని జువ్వలపాళెంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ, చైర్‌పర్సన్ ముఖ్య అతిథులుగా పాల్గొని, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ టీ సుబ్రహ్మణ్యంరెడ్డి, సర్పంచ్ టీ రమణయ్య, జేసీఎస్ కన్వీనర్ చదలవాడ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు కే మాధవరెడ్డి, ఎన్ చంద్రశేఖర్‌రెడ్డి, పీ రాహుల్, డీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు వరం

సైదాపురం: జగనన్న సురక్ష ప్రజలకు వరమని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని వేములచేడు, తలుపూరు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు సీ పోలయ్య, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కే శ్రీనివాసులు నాయుడు, వైస్ ఎంపీపీ టీ భాస్కర్, ఎంపీటీసీ సభ్యుడు ఈశ్వరరాజు, సర్పంచ్‌లు సీ జనార్దన్‌రాజు, ఏ హరిత, ఎంపీటీసీ మాజీ సభ్యుడు టీ నారాయణరావు, నేతలు కే శ్రీనివాసులుచౌదరి పాల్గొన్నారు.

విస్తృతంగా సేవలు

పెళ్లకూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు విస్తృతంగా సేవలు అందిస్తున్నట్లు ఎంపీపీ శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం పునబాకలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిత్ర, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రిస్కిల్లా, ఎంపీటీసీ సభ్యుడు కుమార్ స్వామి, నాయకులు లింగమనాయుడు, లోకేష్‌నాయుడు, కృష్ణయ్య, మల్లిరెడ్డి, రమణారెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

అర్హులందరికీ లబ్ధికే సురక్ష

ఓజిలి: అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి లబ్ధి చేకూర్చేందుకు రాష్ట్రప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ జే బాబురెడ్డి, సీనియర్ నేత పాల్పూరు పెద్దచెంగయ్య అన్నారు. మండలంలోని అత్తివరం సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఏఓ విజయలక్ష్మి, సర్పంచ్‌లు రమణయ్య, మహేందర్‌రెడ్డి, నాయకులు సీ శ్రీధర్‌రెడ్డి, ఎ గురుమూర్తి, ఏ రవీంద్రబాబు, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మీజూరులో..

దొరవారిసత్రం: మీజూరు సచివాలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఏఓ రఘురావయ్య, ఆర్ఐ ప్రవీణ్‌రాయల్, కార్యదర్శి మధు, సర్పంచ్ ప్రసాద్‌నాయుడు, నాయకులు బాలరాజు, శేఖర్ పాల్గొన్నారు.

పెనుబర్తిలో..

రాపూరు: మండలంలోని పెనుబర్తి గ్రామంలో జరిగిన సురక్ష కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రవీంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపాల్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఆనంద్‌రెడ్డి, ఎంపీడీఓ అప్పాజీ పాల్గొన్నారు.

తిరుమూరులో..

వాకాడు: మండలంలోని తిరుమూరు సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్ రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు కే దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మమ్మ, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.


నాయుడుపేట: సర్టిఫికెట్ ఇస్తున్న ఎంపీపీ, మున్సిపల్ చైర్‌పర్సన్


పెళ్లకూరు: మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి


ఓజిలి: అత్తివరంలో..

దిశయాప్‌లో ఫిర్యాదు.. పోలీసుల తక్షణ స్పందన


మహిళకు రక్షణ కల్పిస్తున్న పోలీస్ కానిస్టేబుల్

నాయుడుపేటటౌన్: వేధింపులకు గురిచేస్తున్న భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసి, జైలుకు పంపిందన్న కోపంతో బెయిల్‌తో బయటకు వచ్చి, ఆమెపై మళ్లీ దాడికి యత్నించడంతో ఆమె దిశయాప్‌లో ఫిర్యాదు చేసింది. యాప్‌లో ఫిర్యాదు అందుకున్న పోలీసులు తక్షణం సంఘటన స్థలానికి చేరుకుని ఆ మహిళకు రక్షణ కల్పించిన సంఘటన నాయుడుపేట పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నాయుడుపేట పట్టణానికి చెందిన కుమార్ అదే ప్రాంతానికి చెందిన మహిళను వివాహం చేసుకున్నాడు. మద్యానికి బానిస అయిన అతడు తరచూ భార్యను చిత్ర హింసలు పెట్టడమే కాకుండా గతనెలలో ఆమెపై విచక్షణ రహితంగా దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడి నుంచి తప్పించుకున్న బాధితురాలు ఈ విషయమై అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేసి, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇటీవల బెయిల్‌పై కుమార్ బయటకు వచ్చాడు. ఈ క్రమంలో తన భార్య తనని జైలుకు పంపిందని కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో కుమార్ బుధవారం రాత్రి పట్టణంలోని గడియారం సెంటర్ సమీపంలో పుట్టింట్లో ఉన్న భార్య వద్దకు వెళ్లి దౌర్జన్యం చేసి, దాడికి యత్నించడంతో బాధితురాలు దిశ నంబర్‌కు ఫోన్ చేసింది. దీనిపై స్పందించిన ఎస్ఐ శ్రీకాంత్ వెంటనే బాధితురాలి ఇంటి వద్దకు వెళ్లి, ఆమెకు రక్షణ కల్పించారు. దాడికి యత్నించిన కుమార్‌ను అదుపులోకి తీసుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు.